# దీపం

## స్త్రీవాద కథలు



సంకలనం

నన్నపనేని అయ్యన్‌రావు

# ఇందులో...


| | | | | | |
|---|---|---|---|---|---|
| | ఆలోకనము | - | నన్నపనేని అయ్యన్‌రావు | - | 5 |
| 1. | పిన్ని | - | కొడవటిగంటి కుటుంబరావు | - | 21 |
| 2. | బోన్‌సాయ్ బ్రతుకు | - | అబ్బూరి ఛాయాదేవి | - | 27 |
| 3. | మాఘ సూర్యకాంతి | - | పి.సత్యవతి | - | 31 |
| 4. | సుధీర | - | డా. ఆరేటి కృష్ణ | - | 41 |
| 5. | గోడలు | - | ఓల్గా | - | 49 |
| 6. | రిటైర్‌మెంట్ | - | ఇంద్రగంటి జానకీబాల | - | 56 |
| 7. | సుశీల | - | డా.పాపినేని శివశంకర్ | - | 59 |
| 8. | మసిగుడ్డ | - | కుప్పిలి పద్మ | - | 66 |
| 9. | పోగులు తెగిన అల్లిక | - | నల్లూరి రుక్మిణి | - | 71 |
| 10. | మనోవీథి | - | దాసరి శిరీష | - | 79 |
| 11. | గమ్యం దిశగా | - | అల్లూరి గౌరీలక్ష్మి | - | 88 |
| 12. | ఆ రాత్రి | - | డా. వాడ్రేవు వీరలక్ష్మీదేవి | - | 93 |
| 13. | స్ఫూర్తి | - | గోపాలుని అమ్మాజీ | - | 100 |
| 14. | నాలుగోతరం | - | జి. లక్ష్మి | - | 107 |
| 15. | ఊబి | - | డా. ఆలూరి విజయలక్ష్మి | - | 112 |
| 16. | ఒక భార్య ఒక భర్త | - | దగ్గుమాటి పద్మాకర్ | - | 116 |
| 17. | కెరటాలు | - | భాగవతుల రమాదేవి | - | 121 |
| 18. | సర్దుబాటు | - | జ్యోతి సుంకరణం | - | 127 |

# పిన్ని

## కొడవటిగంటి కుటుంబరావు

పిన్ని రావటం కామాక్షికింకా కళ్లకు కట్టినట్లుగానే ఉంది. ఆవిణ్ని నాన్నే వెంటబెట్టుకొచ్చాడు. వాళ్లు వచ్చిన అలికిడికే కామాక్షి నిద్ర లేచింది. నిద్ర కళ్లతో పిన్నిని చూచింది. ఒక పెద్ద పెట్టె ముందు కూచుని, బలవంతాన ముందుకు వంగి, మెడలో మంగళసూత్రానికి కాబోలు కట్టిన తాళం గుత్తితో పెట్టె తెరుస్తున్నది. నిగ నిగ లాడే పిన్ని, ఒత్తయిన పిన్ని జుట్టూ, తెల్లగా మెరిసే ఆమె చెక్కిలి కామాక్షికి కనిపించాయి.

ఆ చూపులోనే కామాక్షి పిన్నిని మోహించింది. అది చంటిపిల్లలకు కూడా కలిగే మోహం.

''పిన్ని ఎప్పుడూ మనింటో ఉండిపోతే బాగుండును. ఎప్పుడూ పిన్నికేసి చూస్తూ ఉంటే బాగుండును'' అనుకున్నది కామాక్షి ఎందుకో. పిన్ని మళ్ళీ వెళ్ళి పోతుందనీ, తన కప్పుడు దిగులుగా ఉంటుందనీ కామాక్షి కొంక బెంగ అప్పుడే పట్టుకుంది. పిన్నిని ఏవేవో కష్టాలు చుట్టుముట్టుకున్నాయనీ ఆమె వాటితో కృశించిపోతోందనీ మరీ బెంగ పట్టుకుంది.

పుట్టి పెరిగాక కామాక్షి పిన్నిని చూడటం ఇదే ప్రథమం. కామాక్షి నాలుగేళ్ళ పిల్లప్పుడు పిన్ని వచ్చినట్టు అమ్మ చెప్పింది. కాని ఆ చూపు కామాక్షికి బొత్తిగా జ్ఞాపకం లేదు. కామాక్షికి చుట్టాలు – ప్రత్యేకించి అమ్మ వేపువారు – చాలా మంది ఉన్నారు. వాళ్ళంతా కామాక్షికి బాగా తెలిసిన మనుషులు. వాళ్ళ కేసి ఎవరూ – అంటే కామాక్షి – చాలా సేపు చూడనవసరం లేదు. వాళ్లను చూస్తూంటే ఏవేవో విచిత్రమైన, అలవాటులేని ఆలోచనలు రావు. పిన్నిని ఎంత సేపైనా చూడవచ్చు. అమ్మ చెల్లెలేగా అనిపించదు – పిన్ని ఎట్లా మాట్లాడుతుందో, ఏమంటుందో, ఏం చేస్తుందో అని చూస్తూ ఉండబుద్ధి అవుతుంది. అదీ పిన్నికీ మిగిలిన వాళ్లకీ తేడా.

అకస్మాత్తుగా కామాక్షికి ఆనందంతో ఒళ్ళంతా వేడెక్కినట్లయింది. తను అచ్చంగా పిన్ని పోలికే అని నాన్న ఎన్నో సార్లు అనటం కామాక్షికి జ్ఞాపకం వచ్చింది. లేచి మొహం కడుక్కోగానే తన మొహం అద్దంలో చూసుకుందామనుకున్నది కామాక్షి.

పిన్ని పెట్టె తెరచి ఏవో బట్టలు సర్దసాగింది. అమ్మకూ పిన్నికీ ఉన్న తేడా చూసి కామాక్షి ఆశ్చర్యపోయింది. పిన్ని బాగా బొద్దుగా ఉంది. పిన్ని కట్టుకున్న చీరె ఒకటే కాక పెట్టెలో ఉన్న చీరెలన్నీ కూడా నాజూకుగా ఉన్నాయి. అమ్మకు అటువంటి చీరె ఒక్కటీ లేదు. అసలు అమ్మ ముత్తయిదల్లే ఉంది. పిన్ని చేతివేళ్ళకి ఉంగరాలు కూడా ఉన్నాయి; ఆవిడ చేతితో పని చేస్తూంటే వేళ్లు కదిలినప్పుడల్లా అవి కూడా కదలటం చూస్తూంటే ఎంతో బాగుంటుంది.

''పిన్ని వచ్చింది చూశావుటే?'' అన్నది అమ్మ, కామాక్షి నిద్ర లేచిందని కనిపెట్టి.

కామాక్షి తల ఊపింది.

''పలకరించవేం మొద్దూ?''

పిన్నిని గురించి కామాక్షి ఏమనుకుంటుందో అమ్మకి ఒక్కరవ్వయినా అంతు చిక్కలేదు.

''పొట్టి తిపాచీ ముండ! దానికి ఎవరి గొడవా పట్టదే!'' అన్నది అమ్మ పిన్నితో.

పిన్ని మాట్లాడలేదు. ఒకసారి అమ్మకేసి, ఒకసారి కామాక్షి కేసి చూసి పెట్టె మూయసాగింది.

''రేపు పెళ్లి అయితే కాపురం ఎట్లా చేస్తుందోగాని'' అని అమ్మ మనసులో మాట పూర్తి చేసింది.

ఈ సారి పిన్ని అమ్మకేసి చాలాసేపు చూసింది.

''పిన్నిది అచ్చంగా కాంచనమాల మొహం!'' అనుకున్నది కామాక్షి. కొద్ది రోజుల క్రితమే ఇంటిల్లిపాదీ వెళ్ళి ''వందేమాతరం'' సినిమా చూశారు.

''అందరూ ఎట్లా చేస్తున్నారో అదీ అట్లాగే చేస్తుంది. ఆడదై పుట్టినాక అనుభవించొద్దూ?'' అన్నది పిన్ని.

పిన్ని కేదో చెప్పరాని కష్టాలున్నాయనేది కామాక్షి రూఢి చేసుకున్నది.

పాపం, పిన్ని కెందుకు రావాలి కష్టాలు? కొంత మందికి కష్టాలు వస్తే బాగానే ఉంటుంది. వాళ్ళు చక్కగా ఎప్పుడూ వాటిని గురించి చెప్పుకుంటూ వుంటారు. పిన్ని అట్లా చెప్పుకోదు. కష్టాలు చెప్పుకొనే వాళ్ళను చూసి అందరూ, ''అయ్యో, పాపం'' అంటారు. అప్పుడు వాళ్లకి బాగుంటుంది. పిన్నివంటివాళ్లని చూసి ''అయ్యో పాపం'' అని ఎవరూ అనరు. అట్లా అనిపించుకొనే మనిషి కాదు పిన్ని.

పిన్నిని గురించి ఈ విషయాలు కామాక్షి కెట్లా తెలుసునో ఊహించటం మనకి సాధ్యం కాదు. చిత్రమేమంటే కామాక్షి ఊహ అబద్ధంకాదు. చిన్న పిల్లలు పెద్దవాళ్లను గురించి ఒక్కొక్కప్పుడు చిన్న విషయాలలో మోసపోయినా, ఒక్కొక్కప్పుడు పెద్దవాళ్లకు సంబంధించిన పెద్ద పెద్ద విషయాలలో ఇట్టే నిజం తెలుసుకుంటారు.

★★★

కామాక్షికి పదకొండేళ్ళు నిండుతాయి. పెళ్ళి విషయము ఆలోచిస్తున్నారు. పధ్నాలుగేళ్ళు వెళ్ళేదాకా ఎందుకు చెయ్యటమని నాన్న. ''మహాబాగా చెప్పారులెండి. అది కాస్తా ఈడేరకముందే ఆ మూడు ముళ్ళూ వేయించండి. మీకు పుణ్యముంటుంది. అందరిచేతా మొహాన ఉమ్మేయించుకోవటము నావల్ల కాదు. ఏ విద్దూర మొచ్చినా ముందు మనింటోనే. రాటాలు పెట్టి చేతులుపడేట్టు దారం తీయించారు. ఏడాదిపాటు ఎక్కడ చూసినా ఏకులే నూలుపోగులే. ఏది అనుకున్నా అల్లరీ ఆగమూ అయితే గాని మీరు వద్రు. ఎరగని విషయమా ఏమి''టని అమ్మ.

నాన్న ఒకటనుకున్నాడు. అమ్మ కోసం కక్కుర్తిపడి ఏదో ఒక సంబంధం అంటగట్టనూవద్దు. మంచి సంబంధం వస్తే నియమం కోసం ఆగనూవద్దు. అందుకని నాన్న సంబంధాలు చూస్తూనే ఉన్నాడు.

అమ్మ కాస్త తొందరపడినా ''నాన్న తనకు మంచి సంబంధం కాకపోతే చెయ్యడని'' కామాక్షికి తెలుసు. అదీకాక కామాక్షికి కళ్యాణం బొట్టు పెట్టుకుందామని, మహా ఉంది. పెద్దయి ఎద్దల్లే పల్లకీలో కూచుంటే ఏం బావుంటుందేమిటి?

ఇంతా చేసి కామాక్షికి సంబంధం సిద్ధంగానే ఉంది. నాన్న అన్నం తిని బయటికి వెళ్ళినాక, అమ్మ పిన్నీ అన్నాలకు కూచున్నప్పుడు ఒకనాటి రాత్రి అమ్మ ఈ సంబంధం గురించి చెప్పింది.

''నిక్షేపంలాంటి సంబంధం. కుర్రవాడు ఎట్లా ఉంటాడనుకున్నావు? పండునాయనల్లే ఉంటాడు. పద్దెనిమిదేళ్ళు, అప్పుడే బియ్యే చదువుతున్నాడు. వచ్చే ఏటికల్లా బి.య్యే. పాసయిపోతాడు. కట్నం కోరుతార్లే. అయిదుగురన్నదమ్ములు. అయితే ఏం? పెద్ద ఆస్తి. లంకంత ఇల్లు?'' అని అమ్మ మహా ఉత్సాహంగా చెప్పుకు పోతోంది.

# మాఘ సూర్యకాంతి

## పి.సత్యవతి

పండక్కి అల్లుడు ఇంటికి వస్తున్నాడంటే హడావుడి. అమ్మాయి పెళ్ళయినాక వచ్చిన తొలి పండగ. అందులోనూ దీపావళి పండగ. పండగనాడు పిండివంటలన్నీ సుష్టుగా వండుకు తినడం, పిల్లలు అడిగినన్ని టపాసులు కొనిపెట్టడం మా వారికి చాలా సరదా. తిండి తినడానికీ, అనువైన బట్టలు కట్టుకోడానికీ, తడుముకోవలసి వచ్చిన ఈ రోజుల్లో ఇన్నేసి టపాసులు కాల్చేయడం, ఒకే రోజున అన్ని వంటకాలు చేసుకోవడం – నాకూ, మా పెద్దమ్మాయి కమలకూ యిష్టం వుండదు. కానీ ఏం చేస్తాం – ఇంటికి పెద్ద మావారు. ఆయన చెప్పినట్టు వినడం నా ధర్మం. అంతేకాదు ప్రతి విషయానికి వాదన పెట్టుకుని ఓడిపోవడం తెలివితక్కువా, పరువుతక్కువా అని నేనర్థం చేసుకున్నాను.

బావగారొస్తున్నారని మా మగపిల్లలిద్దరూ గంతులు వేస్తున్నారు. మా రెండో అమ్మాయి శ్యామల అక్కమీద జోకులు విసురుతూంది. మావారు అల్లుడికోసం గది సర్దించారు – కానీ – ఈ పెద్దమ్మాయి కమల మాత్రం సంతోషంగా కనపడలేదు. అతని రాకకోసం నిరీక్షిస్తున్నట్లూ అనిపించలేదు. దాని కళ్ళల్లో ఓ విధమైన భయం – దిగులు లీలామాత్రంగా కనపడుతూనే వున్నాయి.

''ఏమే ఎందుకలా వున్నావు?'' అంటే – ''ఏమీలేదమ్మా పని ఎక్కువగా వుంది, తలనొప్పి'' అన్నది అంతే.

''పోనీ సెలవు పెట్టు వారం రోజులు....'' అన్నాను.

''కాలేజీలో పని జాస్తిగా వుంది సెలవు పెట్టడానికి కుదరదమ్మా'' అన్నది.

పని ఎక్కువైతే బాధపడే పిల్లకాదు మా కమల. పని అంటే దానికి లెక్కలేదు.

నేను కనిపెడుతూనే వున్నాను. అసలు పెళ్ళి అయిన దగ్గర నుంచీ దాని కళ్ళల్లో కాంతి తగ్గింది.

''లడ్డుండలు కడుతున్నావా లేదా?'' అంటూ వంట ఇంట్లోకి వచ్చారు మావారు.

''కడుతున్నాను'' అన్నాను.

''ఇంకేం చేస్తున్నావు?''

చెప్పాను.

వెళ్ళిపోయారు.

సాయంత్రం అల్లుడు వచ్చేడు. కొత్తగా పెళ్ళి చేసుకున్న జంట. అతని రాకకోసం మనస్సంతా కళ్ళు చేసుకుని ఎదురు చూడాలి. మధురోహల్లో మైమరచి పోవాలి. కమల దిగులుగా నిర్లిప్తంగా అతనికి మంచినీళ్ళు తీసుకువెళ్లింది.

నేను చెబుతూనే వున్నాను, అమ్మాయికీపెళ్ళి యిష్టంలేదని. ఆయన విన్నారా? తక్కువ కట్నంలో వచ్చిన మంచి సంబంధం అంటూ దాన్ని బలవంతం చేసేరు. నాచేత చేయించేరు. పెళ్ళి కావడంతోనే పిల్లలో చెలాకీతనం పూర్తిగా పోయింది.

తలంటు పోసుకుని కొత్తచీర కట్టుకుని మంచి ముత్యంలా ముచ్చటగా వున్న అమ్మాయి కళ్ళల్లో దిగులు నేను చూడలేకపోతున్నాను. అవును నేనేం చెయ్యగలను?

భోజనాలయ్యాయి. గదిలో అగరువత్తులు వెలిగించేను. మొగలిపూల వాసన గదంతా పరుచుకుంది. పిల్ల తలలో జాజిపూలు తురిమాను. నేను జాజిపూలు తురుముతూంటే అది కళ్ళు తుడుచుకుంది.

''ఏమిటమ్మా ఇది!''

''అమ్మా – ఇవ్వాళ నేను శ్యామల దగ్గర పడుకుంటాను. ఒంట్లో బాగాలేదు'' అని నా గుండెల్లో తల దాచుకొని బావురుమంది.

''పోనీలే అమ్మా. దానికి ఏడవడం ఎందుకు, అట్లాగే'' అన్నాను.

''అమ్మాయికి వొంట్లో బాగాలేదు'' అని అల్లుడికి విన్నవించుకున్నాను. నావంక ఓ కోరచూపు విసిరి, సిగరెట్ ముట్టించుకున్నాడు అతను. అల్లుడు అందగాడే. మెడ, చెవులూ కప్పేసే జుత్తు, చెంప పట్టీలు – బెల్ బాటం పేంటులు – రంగు రంగు చొక్కాలు – మంచి కళ్ళు – ముక్కూ, చామనఛాయ.

ఇంకా ఉద్యోగం రాలేదన్నమాటేగానీ అమ్మాయితో సమంగా బి.ఏ. చదివాడు. మరి ఏమిటి లోపం !

మరునాడు సాయంత్రం అంతా సినిమాకు వెళ్ళేరు. అల్లుడికి సినిమా వెర్రి. అతనుండేది పల్లెటూర్లో. ఇక్కడికొచ్చినప్పుడల్లా సినిమాలు చూడనిదే వెళ్లడు. కుర్రవాడు చూస్తే చూశాడు –పోనీ.

భోజనాలయ్యాక మళ్ళీ ఊదొత్తులు వెలిగించేను. పిల్ల తలలో సన్నజాజులు తురిమేను. ఈసారీ కళ్ళు తుడుచుకుంది కానీ, ఏమీ అనలేదు.

మావి నాలుగు గదులు. అల్లుడికిచ్చిన గదికి, ప్రత్యేకం సందులోకి చువ్వల తలుపుంది. అంతేకాదు. ఆ గదిలోనుంచి నేను పడుకునే గదిలోకి తలుపుంది. నేనా తలుపు ప్రక్కనే మంచం వేసుకున్నాను.

నాకు ఒక్కొక్క రోజు పడుకోగానే నిద్రవస్తుంది. పగలంతా పని చేసీ చేసీ అలసిపోయి వుంటాను. ఒళ్ళునెప్పులు, నడుంనెప్పీ, శోషవచ్చినదానిలా వొళ్ళెరక్కుండా నిద్రపోతాను. కానీ, ఒక్కొక్క రోజు రెండవ ఆట సినిమా జనం వెడుతున్న చప్పుళ్ళు వినపడేటప్పటికి కూడా నిద్రరాదు. ఏవేవో జ్ఞాపకం వస్తూంటాయి.

నా పక్కన నా రెండో కూతురు నిద్రపోతోంది. మావారు వరండాలో పడుకుని బ్రహ్మాండంగా గురక పెడుతున్నారు.

మా మామగారి హయాంలో కొన్న గోడగడియారం టిక్కుటిక్కుమంటూ వెక్కిరిస్తున్నట్లున్నది. ఆయన గురకకీ, గడియారం చప్పుడికీ పొంతన కుదరక, రెండూ కలిసి దుష్ట సమాసంలా వున్నాయి. నేను నావివాహపు తొలి దినాల్లో సంబరాన్ని తలుచుకున్నాను. కొన్ని కొన్ని సంఘటనలు తలుచుకుంటే జీవితం ఎలా వుండకూడదో ఇప్పుడు నాకర్థం అవుతూ వుంటుంది.

అలా కళ్ళు తెరుచుకుని పడుకున్న నేను గదిలో నుంచి వినవచ్చిన పెనుకేకకి ఉలిక్కిపడి లేచి కూర్చుని, మరుక్షణమే గదితలుపు బాదాను. ఎవరూ తియ్యలేదు. మావార్ని లేపుకొచ్చి యిద్దరం తలుపు గట్టిగా కొట్టేం. తరువాత ఆయన సందులో వెళ్ళి చూస్తే చువ్వల తలుపు తీసి వుంది. గదిలో అల్లుడు కాల్చిపడేసిన సిగరెట్ పీకలున్నాయి. మంచం మీద అస్తవ్యస్తంగా పడివుంది అమ్మాయి. ఎంత కుదిపినా లేవలేదు.

''డాక్టర్ని పిలవండీ దానికి స్పృహ తప్పింది'' ఏడుస్తున్నాను నేను.

# సుశీల

## డా.పాపినేని శివశంకర్

తప్పదు. ఒక్కోసారి  మనకెంతో ఆత్మీయులైన వాళ్ళని బాధించాల్సి వస్తుంది.

నరేంద్ర నాకు బావమరిది అనటం కంటే ఆత్మీయుడంటే బాగుంటుంది. నాకు పెళ్లయిన కొద్ది రోజుల్లోనే వాడు మామధ్య కొత్తగా ఏర్పడ్డ చుట్టరికం చెరిపేసి స్నేహితుడయ్యాడు. నాశ్రీమతి నళిని తత్వానికి, వాడి తత్వానికి ఎంతో తేడా వుంది.  నళిని ఎప్పుడు నాతో మాట్టాడినా  ఆమాటల వెనుక నేను తన భర్తననే గౌరవం వుంటుంది. నరేంద్ర మాటల్లో గౌరవం కాక స్నేహం కన్పిస్తుంది. తనతో ఏ విషయం చర్చించినా క్షణంలో ఆవిషయాన్ని నా నుంచి వేరుచేసి స్వేచ్ఛగా పరిశీలిస్తాడు. నిస్సంకోచంగా తన అభిప్రాయం చెబుతాడు. వాడితత్వం నాకు నచ్చినా నేను మాత్రం అలా ప్రవర్తించలేను. ఎదటి వాళ్లని బట్టి అభిప్రాయాలు 'రిజర్వ్' చేసుకోవటం నాకలవాటు.

ఇంతకీ ఈ కఠోరవార్త వాడి చెవినెలా వెయ్యాలో తోచకుండా వుంది. ప్రయాణమంతా నాకిదే ఆలోచన. అసలు నేను గాజులూరు వెళ్లకుండా వుంటేనే బావుండేదేమో నన్పించింది. కానీ వెళ్లకుండా ఎలా? బావమరిది పెళ్లి సంబంధమాయె. పైగా వాడే స్వయంగా బతిమాలాడాయె.

★★★

''బావా! నువ్వే వెళ్లి సంగతులన్నీ కనుక్కురావాలి'' అన్నాడు వాడు.

''సంగతులంటే? కట్నం ఎంత ఇస్తారు, ఆడపడుచు లాంఛనాలు-ఇవేనా?'' అడిగాను నేను, వాణ్ణి కాస్త రెచ్చగొడుతూ. నరేంద్ర నవ్వాడు.

''మొదటిది నాకవసరంలేదు. ఇక రెండోది అక్కనే అడగాలి'' అన్నాడు.

''ముందు సంబంధం కుదరనివ్వండి''అంది నళిని లౌక్యంగా విషయాన్ని దాటేస్తూ.

వాడి సంగతి నాకు బాగా తెలుసు. కట్నం కాదన్నవాడు లాంఛనాలకి ఒప్పుకుంటాడా?

''నాకు సెలవుల్లేవు. పోనీ నీపెళ్లి విషయం నువ్వే వెళ్లి తేల్చుకుంటే పోదూ?'' అన్నాను.

''అదేమిటండీ? వాడు వెళ్లి సూటిగా ''మీఅమ్మాయిని నాకిచ్చి పెళ్లి చెయ్యండి' అని అడుగుతాడా ఏమిటి? పెద్దవాళ్లు ఉన్నదెందుకో?'' అంది శ్రీమతి.

వెంటనే నా పెద్దరికం గుర్తుకొచ్చి సరేనన్నాను. ఆఫీసులో మేనేజర్ని బతిమాలి, రెండు రోజులు లీవు సంపాదించాను. ఆరోజే బయర్దేరి గాజులూరు వెళ్లాను.

అక్కడ మాఫ్యామిలీ ఫ్రెండు  సుధాకరరావు ఉంటున్నాడు. ఇద్దరు కొడుకులు వాడికి. ఇద్దరికీ పెళ్లిళ్లు చేసి, పొలాలు కౌలుకిచ్చి, నిశ్చింతగా కాలం గడుపుతున్నాడు. ఆయన చిన్న కొడుక్కీ, మా నరేంద్రకీ మంచి

స్నేహం. హఠాత్తుగా నన్నుచూసి సుధాకరరావు ఆశ్చర్యపోయాడు. మాటా మంతీ అయింతర్వాత అసలు సంగతి ఎత్తాను.

''ఈమధ్య మా నరేంద్ర మీవాడి కోసం ఇక్కడికి వచ్చాడుగా? అప్పుడు ఇక్కడో అమ్మాయిని చూశాడట. చాలాసార్లు మాట్లాడుకున్నారట. ఆ అమ్మాయి తనకి నచ్చిందనీ, వివరాలు తెలుసుకు రమ్మనీ నన్ను తోలాడిక్కడికి'' అన్నాను.

''ఆహా! మొత్తానికి మీవాడు ఘటికుడే. ఏదో మావాడూ, మీవాడూ కలిసిమెలిసి తిరుగుతున్నారనుకున్నాగాని ఇంత గ్రంథం ఉందనుకోలా. అలాగే కనుక్కుందాం. సమయానికి మావాడు ఊళ్లోలేడు. ఇంతకీ ఎవరా అమ్మాయి?''అడిగాడు సుధాకరరావు.

''ఈ పక్క ఇల్లేనట. దశరథరామయ్యగారి పెద్దకూతురన్నాడు''చెప్పాను నేను.

సుధాకరరావు ఉలిక్కిపడ్డాడు. ''ఆ అమ్మాయా? సుశీల?'' అన్నాడు తెల్లబోతూ.

''ఏం? అమ్మాయి బావుండదా?'' అడిగాను నేను సందేహిస్తూ.

''అబ్బే! అమ్మాయికేం, బంగారపు బొమ్మ. డిగ్రీ చదివింది. తెలివైన పిల్ల. కానీ.....''

నాకేం బోధపడక ఏమిటన్నట్టు చూశాను.

''ఎలా చెప్పాలో అర్థంకావటం లేదు. మీవాడి ఎన్నిక ఒక రకంగా సరైందే. కానీ... మూడేళ్ల కిందట ఆ అమ్మాయి మానభంగానికి గురైంది''.

నేను దిమ్మెరపోయాను. సుధాకరరావు కొనసాగించాడు.

''మూడేళ్ళ కిందట ఇంట్లో ఎవరు లేని సమయంలో పాపం, ఆ పిల్లని వాళ్ల బంధువుల కుర్రాడే బలాత్కరించాడు. వాణ్ణి దేహశుద్ధి చేసి పంపించేశారు. ఊరంతా గుప్పుమంది. ఆ తర్వాత వాడికే ఇచ్చి పెళ్లి చేద్దామని పెద్దవాళ్లు ప్రయత్నించారు. కాని ఆపిల్లే ఒప్పుకోలేదు. వాడి మొహం చూడను, పొమ్మంది. అప్పటి నుంచి ఆపిల్లకి పెళ్లి కావటం కనాకష్టంగా ఉంది. రెండో పిల్ల కూడా పెళ్లికెదిగి కూర్చుంది. కాని ఏం లాభం? ఎన్ని సంబంధాలు వచ్చినా ఈ సంగతి తెలియగానే వెనక్కి పోతున్నాయి. పోనీ విషయం దాచి పెట్టి, ఎవడికైనా కట్టబెడ దామా అంటే సుశీల బొత్తిగా ఒప్పుకోవటం లేదు. అదీసంగతి.''

నేను మాట్లాడలేక పోయాను. మనస్సు పరిపరివిధాల పోయింది. పాపం, ఆ అమ్మాయి మనస్సు బాగా గాయపడి వుంటుంది. ఆడపిల్ల శీలం కోల్పోయిందని తెలిస్తే ఇక పెళ్లెట్లా అవుతుంది? ఈ సానుభూతి సరే. నరేంద్ర సంగతేమిటి? వాడికీ విషయం ఎట్లా చెప్పాలి? ఎంతో ఉత్సాహంగా తనంతట తనే పిల్లని ఎన్నుకున్నాడు. ఈ విషయం తెలిస్తే చాలా బాధపడతాడు. కాని చూస్తూ చూస్తూ ఆ అమ్మాయి నెట్లా పెళ్లాడతాడు? నేను మాత్రం ఎలా ఒప్పుకోగలను?

నా ఆలోచనలు తెగేలోగా ఎవరో అమ్మాయి గబగబా లోపలి కొచ్చింది. 'అంకుల్' అంటూ... ఎంతో అందంగా చలాకీగావుంది. కొత్తవాణ్ణి నన్నుచూసి మొహమాటంగా ఆగిపోయింది.

''ఫర్వాలేదు రామ్మా! నరేంద్ర తెలుసుగా? వాళ్ల బావ'' అంటూ సుధాకరరావు నన్ను పరిచయం చేశాడు. ''మన పక్కింటి అమ్మాయి. సుశీల'' అంటూ తనని పరిచయం చేశాడు.

తలవని తలంపుగా ఆ అమ్మాయే కన్పించేపాటికి ఆశ్చర్యంతో అట్లాగే చూస్తుండి పోయాను.

''నమస్తే అంకుల్! నరేంద్ర బాగున్నాడా?'' అని అడిగింది సుశీల.

నేను మౌనంగా తలూపాను. తనకీ నరేంద్రకీ బాగానే పరిచయమై ఉండాలి.

''ఏంటమ్మా పనిమీద వచ్చావు?''అడిగాడు సుధాకరరావు.

# మనోవీథి

## దాసరి శిరీష

తన్మయంగా టి.వి. చూస్తున్న వాళ్ళంతా సిస్టర్ మందలింపుతో అయిష్టంగా కదిలి బెడ్ మీదకి చేరారు. మళ్ళీ రోగుల్లా మారిపోయి హడావుడి చేస్తున్న వాళ్ళందర్నీ నవ్వుతూ, కోప్పడుతూ, చలాకీగా తిరుగుతున్న సిస్టర్‌ని ముచ్చటగా చూస్తోంది రమణ.

''రమణా''

తలతిప్పి శ్రీధర్‌వైపు చూసింది. మాసిన గడ్డం... చిక్కిన మొహం, ఆప్యాయంగా చూస్తున్న కళ్ళు. బెడ్ దగ్గర నిలబడి '' ఏం శ్రీధర్?'' అంది మెల్లగా.

''పుస్తకం చదివేశావా?''

''ఇంకో ఇరవయి పేజీలుండొచ్చు. ఏం కావాలి?''

కొంచెం కదలి కాలుపక్కకి ఎత్తిపెట్టి నిట్టూర్చాడు. దిండు సరిచేస్తున్న రమణని తదేకంగా చూస్తూ ''నువ్వే లేకపోతే నేనేమయిపోయేవాడిని రమణా? నీ ఋణం తీర్చుకోగలనా?'' అన్నాడు.

''నేనేం చేశాను?'' రమణ నవ్వింది.

''నన్ను క్షమించావు. కంటికి రెప్పలా కాపాడుకుంటున్నావు. నిజానికి నువ్వు నాకు పునర్జన్మనిచ్చావు'' అంటూ కృతజ్ఞతగా చేయి ముందుకు చాచాడు. అతన్ని లేపి టాబ్లెట్ నోట్లో వేసి మంచినీళ్ళు తాగిస్తూ ''అంతా డాక్టర్స్ కృషి శ్రీధర్. నేను కష్టపడిందేమీ లేదు.'' అంటూ మళ్ళీ నెమ్మదిగా పడుకోబెట్టింది రమణ.

''నిన్ను అస్సలు పొగడనివ్వవు''

రమణ మళ్ళీ పుస్తకం తెరుస్తూ నవ్వింది. ''పొగడాల్సినంత గొప్ప విషయమయితే కాదు. హాస్పిటల్‌లో అందరి పేషెంట్స్ దగ్గరా ఎవరో ఒకరుంటూ జాగ్రత్తగా కనిపెట్టుకుంటూనే ఉన్నారు. మనో ధర్మాలు, మానవ ధర్మాలు ఉండవా?''

''అంతేనా? మనది దాంపత్య బంధం కాదా, మనల్ని ఇలా దగ్గర చేస్తోంది'' అతను కొంచెం ఆవేశపడ్డాడు. ఆమె ఏమీ అనకపోవడంతో మళ్ళీ తనే.

''నువ్వెన్నయినా చెప్పు, మనదేశంలో వివాహం, కుటుంబ వ్యవస్థా చాలా పవిత్రమయినవి, పటిష్టమయినవి. ఇంకే దేశంలో ఇటువంటివి... రమణా నువ్వు నన్ను అవకాశవాదిగా అనుకున్నా సరే! మనకు తెలియని ఏదో అతీతమైన శక్తి ఈ బంధాలను కాపాడుతోంది. ఏమంటావ్'' అన్నట్టు సాభిప్రాయంగా చూశాడు.

''మంచిదే గదా శ్రీధర్'' అతనికి రగ్గు కప్పి మృదువుగా అంది. మరీ క్లుప్తంగా మాట్లాడుతుంది. సరళంగా సపర్యలు చేస్తుంది. అయినా.... అయినా ఎంతో దూరం. రమణ కాస్సేపు అలాగే నిలబడి ఆ హాలు

దాటి బాల్కనీ దగ్గర కొచ్చింది. ఎంట్రన్స్‌లో ఓ పేషెంట్ దగ్గర సిరంజితో నిలబడ్డ సిస్టర్ చిరునవ్వుతో 'ఎనీ ప్రాబ్లెం?' అంది. దూరంగా కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్న డాక్టర్ ఒక్కసారి కళ్ళెత్తి చూసి మళ్లీ చదువులో మునిగిపోయాడు.

అన్ని రకాల జనాన్ని భరిస్తున్న ఊరు ఎంతో ప్రకాశవంతంగా ఉంది. రాత్రితో చెలిమి చేస్తూ విభిన్నంగా, విలాసంగా, చైతన్యవంతంగా ఉంది. ఎన్ని రకాల జీవితాలు? అందరి తాపత్రయమూ ఒకటే. ఆనందంగా, సుఖంగా ఉండాలని, ఆ ప్రయత్నంలో అంతు లేని కథలూ, బాధలూ.. దురాశలూ... అసలు ఆనందం అంటే ఏమిటి? తన దృష్టిలో ప్రశాంతతే గొప్ప ఆనందం. ఈ ప్రశాంతతలో చిన్న కుదుపు శ్రీధర్‌కి యాక్సిడెంటవటం... విరిగిన కాలుతో హాస్పిటల్‌లో ఉండగానే పారా టైఫాయిడ్ రావడం, స్వప్న ఆదుర్దాగా ఫోన్ చేసి రప్పించడం... మళ్లీ తన లోకంలోకి తను వెళ్ళిపోతే తిరిగి అదే ప్రశాంతత.

అటూ ఇటూ ఏపుగా పెరిగిన చెట్ల నుండి వస్తున్న శీతగాలి ఉల్లాసంగా పలకరిస్తోంది. దూరంగా లాన్ పచ్చగా మెరుస్తోంది. స్వప్న ఎప్పుడూ తనని....

''మేడమ్ మీకు ఫోన్.. లైన్‌లో ఉన్నారు..'' డాక్టర్ బయటకొచ్చి మర్యాదగా పిలిచారు. షాల్ సర్దుకుంటూ ఫోన్ దగ్గరకెళ్ళింది. హలో అంటూనే '' నీ గురించే ఆలోచిస్తున్నాను'' అంది ప్రేమగా.

''నిజమా''

''నిజం''

''లీవు ఎక్స్‌టెండ్ చేశావా?''

''లేదు''

''ఇంకా నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తారేమో గదా?''

''అవును''

''మరి నీతోపాటుగా వైజాగ్ తీసికెళ్లడానికి.. అప్పుడే ఇబ్బంది కదా తల్లీ...'' స్వప్న ఆదుర్దాగా అంది.

''అతను వైజాగ్ రాడు. ఆహా తీసికెళ్లను''

''మరి' హతాశురాలైంది స్వప్న.

ఏదో అనబోయి తమాయించుకుని...''గతాన్ని తవ్వుకోకురా... ప్లీజ్.. నాకు నువ్వే ముఖ్యం. తెలుసుగా'' అంది.

''అవును.. ఆ నమ్మకంతోనే నీతో ఏదయినా మాటాడతాను. అర్థం చేసుకో'' రమణ కంఠం వణికింది.

''ఆల్‌రైట్. డిశ్చార్జ్ అయ్యే రోజుకి నేనొచ్చేస్తాను. నాతో చెప్పకుండా వెంటవెంటనే ఏమీ నిర్ణయాలు తీసుకోకు. '' స్వప్న ఫోన్ పెట్టేసింది. శ్రీధర్ ఛైర్ దగ్గరకొచ్చి నిలబడింది రమణ. పొడుగాటి కనురెప్పలు ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. విశాలమైన నుదురు, మొహంలో బహుశా బాగా కోలుకోగలుగుతున్నాననేమో... అనిర్వచనీయమైన తృప్తి. అందమైన, చురుకైన ఈ శ్రీధర్‌తో పెళ్లి.. ఓ మంచి కల. ఆ తర్వాత జీవితం. పీడకలగాదు గానీ.. ఒక దశలో చేదుగా.

తన బెడ్ మీద వాలి మళ్లీ గుర్తుకొచ్చి హాండ్‌బ్యాగ్ తీసి బి.కాంప్లెక్స్ వేసుకుంది. స్వప్న రాసిన కవరు మళ్లీ పలకరించింది. తనకి మంచి నేస్తం స్వప్న. ఆమె మీద గౌరవమే తనని రెండేళ్ళ తర్వాత ఇక్కడికి కదిలేలా చేసింది. స్వప్న శ్రీధర్‌ని అడ్మిట్ చేశాక ఉత్తరం రాయడమేగాక, ఇటువంటి పరిస్థితుల్లో భార్యతప్ప ఎవ్వరూ శ్రద్ధగా చూడలేరనీ, అతన్ని దక్కించుకునే శక్తి, బాధ్యతా పూర్తిగా రమణకే ఉందని చనువుగా కోప్పడుతూ ఫోన్స్ చేసింది. పంతాలకిది సమయం కాదని బాధపడింది.

# ఆ రాత్రి

## డా.వాడ్రేవు వీరలక్ష్మీదేవి

రజనికి చాలా సార్లు ఆ రాత్రి గుర్తొస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఆడపిల్లల మీద అత్యాచారాలు జరిగిన వార్తలు విన్నప్పుడల్లా.

★★★

ఆమెకు అంతకుముందే విశాల తెలుసు. ఆమె పనిచేస్తున్న ఫాషన్ టెక్నాలజీ కాలేజీలో విశాల చదువుతూ ఉంది. విశాల మీద దాడి జరిగింది కానీ ఆ దాడి ఎలాంటిదో ఎవరికీ తెలీదు. ఆ రోజు – ఆ విశాల మాయమైన రోజు – న్యూస్ పేపర్లలో వచ్చే వార్తలు, టీవీ ఛానల్స్‌లో చూపించే అనేక దృశ్యాలూ రజని కళ్లముందుకి వచ్చాయి. కానీ విశాల మీద జరిగిన అత్యాచారం ఏమిటో ఎలాంటిదో ఎవరికీ తెలియదు. ఇంకోలా చెప్పాలంటే తెలియనివ్వలేదు.

విశాల డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఫాషన్ టెక్నాలజీ కాలేజీలో ఒక సంవత్సరం డిప్లొమా కోర్సు చేసింది. ఫీజు చాలా ఎక్కువే. అయినా వడ్డీకితెచ్చి కట్టింది తల్లి. ఆమె ఒకవైపు కూలిపనిలోకి వెళ్తూ మరోవైపు ఒక ఉద్యోగస్తుల ఇంట్లో వంటపనికి వెళ్తోంది. భార్యాభర్తా ఉద్యోగానికి వెళ్ళిపోయే ఆ ఇంట్లో ఆమె ఉదయమే వెళ్లి వంటా, టిఫినూ చేసి కూలికి వెళ్తుంది. తిరిగి సాయంత్రం మళ్లీ ఆ ఇంటికి వెళ్లి అక్కడ వంట ముగించి తన ఇంటికి వస్తుంది. వంటపనిలో వచ్చే మూడు వేలూ, డ్వాక్రా పొదుపు సంఘంలో దాస్తుంది. ఇప్పుడు ఆ డబ్బులోంచి, వడ్డీ తక్కువే కాబట్టి అప్పు తెచ్చి విశాలను చదివిస్తోంది.

విశాల అసలు పేరు వీరమ్మ. టెన్త్‌క్లాస్ రిజిష్టర్‌లో విశాల అని మార్చుకున్నాక వాళ్ళమ్మ 'ఇశాలా' అని పిలవడం నేర్చుకుంది. 'ఇశాల'కి తండ్రి ఎక్కడుంటాడో తెలుసు. అమ్మని వదిలేసాడనీ, తమ ఇంటికి రాడనికూడా తెలుసు. డిగ్రీ చదువుతూ ఉండగా అక్కడి మేడమ్స్‌కి ఆమె చెప్తుంటేవిని క్లాసులో మరికొందరు అమ్మాయిలు తమదీ అదేకథ అన్నారు.

ఈ కింది తరగతి వర్గంలో చాలా కుటుంబాల్లో తండ్రులు వదిలేస్తారు. మరో సంబంధంలోకి పోతారు. లేదా తాగుబోతులై అప్పులు చేసి పెళ్లాం, పిల్లల్ని రోడ్లమీద వదిలేస్తారు. కానీ తల్లులు తమ సంసారాలు రోడ్లు ఎక్కకుండా ఉండడానికి నానాపాట్లు పడుతూ ఉంటారు.

తన క్లాస్‌మేట్స్ వేషభాషలు చూసిన విశాల వారికి కూడా ఇంత కథ ఉంటుందని అనుకోలేకపోయింది. తన ఒక్కత్తిదే దాచుకోవలసిన కథ అనుకుంది. కానీ క్రమంగా ఒక్కొక్కరి కథా తెలిశాక తను కూడా వీళ్లలాగ మెలగవచ్చని గ్రహించుకుంది. కూలిపనీ, వంటపనీ చేసే తల్లికూతురులా అందరి ముందూ కనిపించనక్కరలేదని గ్రహించుకుంది.

చెవులకు పెద్ద పెద్దగా ఉండి, వేలాడే తక్కువ ఖరీదు ఆభరణాలు తరచుగా మార్చుకుంటూ పెట్టుకోవడం నేర్చుకుంది. కొంచెంగా మెరిసే డ్రెస్‌లలో నుదిటి మీద పడే కాస్త కత్తిరింపు జుట్టుతో, జడస్థానంలో చిన్నపాటి క్లిప్పుతో విరజిమ్మిన జుట్టుతో....

ఎలా తయారయినా సభ్యతకు తక్కువ కాకుండానే ఉండేది మిగతా పిల్లల్లాగే. అబ్బాయిలతో మిగతా ఆడపిల్లల్లాగే కబుర్లు చెప్పేది. ఇంచుమించు అందరితోనూ అన్నయ్య వరసలే కొనసాగేవి.

డిగ్రీ పాసయి ఫాషన్ టెక్నాలజీ కోర్సులో చేరాక కూడా విశాల కట్టుబొట్టుల్లో మార్పురాలేదు. నిజానికి ఆ కాలేజ్‌లో మూడేళ్ళ డిగ్రీకోర్సుచేసే ధనవంతుల అమ్మాయి లున్నారు. వాళ్ళు పేంట్లు; టీషర్టుల్లో కూడా వస్తుంటారు. కార్లలో కూడా వచ్చే పిల్లలున్నారు. ఆ కాలేజీ తన స్తోమతకు మించినదని విశాలకు తెలుసు. కానీ ఆ డిప్లమో తనకు జీవితాన్ని ఇస్తుందన్న ఆశతో అక్కడ చదువుతోంది.

నలభయిమంది విద్యార్థుల మధ్య ఉన్న విశాల మొదట్లోనే రజనిని ఆకర్షించింది. కారణం బహుశా ఆ పిల్లలో ఉన్న పొందిక కావచ్చని రజని అనుకుంది. కానీ కొన్నాళ్ళకి రజనికి మరొక కారణం తెలిసింది. విశాల తక్కువ ఖర్చుతో ఎక్కువ చక్కగా కనిపించేలా తయారయ్యే నేర్పు ఉన్న పిల్ల అని. అందువల్లనే ఆమె ఈ కోర్సులో రకరకాల ప్రాజెక్టు పనులు చేసేటప్పుడు కొత్త కొత్త రకం దుస్తులు డిజైన్ చేసేది. ఫాషన్‌నీ అందాన్నీ చక్కగా కలిపేది. ఇది చాలా తక్కువమందికి మాత్రమే చాతనయిన విద్యఅని రజనికి తెలుసు. ఆమెకు ఆ అనుభవం ఉంది. ఫాషన్ పేరుతో వెర్రిమొర్రితనాన్ని ఆమెకూడా ఇష్టపడదు. ఇదంతా గమనిస్తూ రజని విశాలను ప్రత్యేక శ్రద్ధతో చూడడం మొదలు పెట్టింది.

ఆరునెలలు గడిచేటప్పటికి విశాలలో మార్పురావడం మొదలయింది. కాలేజీకి ఆలస్యంగా రావడం, ఒక్కొక్కసారి మానేస్తూ ఉండడం కూడా రజని గమనించింది. ఒకటి రెండుసార్లు ఒక అబ్బాయి కాలేజిదాకా వచ్చి విశాలను దిగబెట్టడం చూసింది.

రజనీ మేడమ్‌కి విశాల మీద ఉన్న ఆసక్తి శ్రద్ధగా మారి సమయం చూసి ఒకనాడు విశాలను పిలిచి ఆరా తీసింది.

విశాల రోజూ ఇంటి నుంచి సైకిల్ మీద వచ్చి తిరిగి అలాగే ఇంటికి వెళ్తుంది. ఊరి చివర ఉన్న 'రాజీవ్ గృహకల్ప'లో ఒక గదీ వసారా ఉన్న ఇల్లు వాళ్లకు ఎలాగో లభించింది. అంచేత, దూరమయినా సరే ఆ ఇంట్లోనే ఉంటున్నారు తల్లికూతురూను. ఆమెతో కూడా వచ్చే యువకుడు సత్యనారాయణ అంటే సతీష్ పదోక్లాసు దాకా క్లాస్‌మేట్. మళ్లీ ఈ మధ్య కలిశాడు. విశాలను చూసి చిన్నప్పటి నుంచీ ఉన్న ఇష్టాన్ని చెప్పి ఇప్పుడూ అదే ఇష్టంతో అనుచరుడుగా మారాడు.

మగపిల్లవాడు ఆడపిల్లతో నువ్వంటే నాకు బోలెడంత ఇష్టం అని చెప్పే దాకా ఆ పిల్ల ఎంతో స్తిమితంగా ఉంటుంది. తన కోసమే అలంకరించుకుని, కులుకులూ, విలాసాలూ లేకుండా హాయిగా ఉంటుంది. ఒక్కసారి నోటితో చెప్పకపోయినా చుట్టూ ఉన్న మగపిల్లలు గమనిస్తున్నారని తెలిసిందో, ఇక ఆ పిల్ల మనశ్శాంతి కోల్పోతుంది. కాస్త గడుగ్గాయి అయితే వాళ్లనందరినీ లైన్‌లో పెడుతుంది. కానీ అలాంటి వాళ్లది చాలా తక్కువ సంఖ్య.

సరిగ్గా విశాల ఇలా అస్తిమితంగా అవగానే, అనుభవం పండిన రజనికి అర్థమయి పోయింది. ఆమె ఊహ నిజమే అని నిర్ధారణ అయ్యాక మరిన్ని వివరాలు అడిగింది.

సతీష్ మంచి పిల్లవాడేనట, అందరూ చెప్పేలాగే విశాలా చెప్పింది. డిగ్రీ, పి.జి. డిగ్రీ కూడా అయ్యాయి. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ, చిన్నచిన్న జాబ్‌వర్క్‌లు చేస్తున్నాడు. తనలాగే తండ్రి వదిలేసిన తల్లి బిడ్డ. ఇద్దరికీ ఉద్యోగపుదారులు దొరికేక పెళ్ళి చేసుకుందామనుకుంటున్నారట.

# ఒక భార్య - ఒక భర్త

## దగ్గుమాటి పద్మాకర్

భర్తతో మాట్లాడిన తర్వాత అతడ్ని కాసేపు హాల్లో కూర్చోమని చెప్పి, భార్యని లోపలికి పంపమని అక్కడున్న అమ్మాయితో చెప్పాడు డాక్టరు. తలుపు తెరుచుకుని లోనికి వచ్చిందామె. ఎదురుగా సీటు చూపించి కూర్చోమన్నాడు డాక్టరు. క్షణం సేపు ఏమీ పాలుపోక దుస్తులు సవరించుకోబోయి ఆగి మళ్ళీ వద్దనుకుని ముంగురులు వెనక్కి తోసుకుందామె. డాక్టరు అడిగాడు. ''పల్లవి కదా... బాగున్నారా?'' ''బాగున్నాను సార్''. ''మీరు అనుకుంటున్నది నిస్సంకోచంగా చెప్పండి'' ఆమె నొసలు ముడివేస్తూ చాలా విషయాలు చెప్పి చివరగా అంది.. ''ఇటీవల నాతో అస్సలు మాట్లాడడంలేదు సార్. పడుకుంటే పైన చెయ్యికూడా వెయ్యడం లేదు. నేనేసినా తోసేసి అటుతిరిగి పడుకుంటున్నాడు''.

ఆమె మాటలు వింటూనే భర్తచెప్పిన వివరాలు తిరగేస్తున్నాడు డాక్టరు. వాళ్ల పెళ్ళయి రెండేళ్ళు అయింది. ఆమెకి భర్తపై కంప్లెయింట్స్ తప్ప తనలో మంచి ఒక్కటీ కనపడటం లేదు. ఆమె ఏమాట కూడా పరుషంగా తప్ప సౌమ్యంగా మాట్లాడడం లేదు.... అనుకున్నాడు డాక్టరు. ఆమె వైపు చూశాడు. నొసలు ముడివేస్తూ కాస్త అసహనంగానే వుంది. అది భర్తపైనో లేక ఇలా ఇంటిగుట్టు మూడో మనిషి దగ్గర బైటపెట్టాల్సిరావడం వల్లనో అర్థం కావడం లేదు.

''మీ వారిలో మీకు తెలిసిన మంచి గురించి ఏమైనా చెప్తారా?'' అడిగాడు డాక్టర్. ఆమె కాసేపు ఆలోచించి అంది,

''తనకి నిజాయితీపరుడైన ఆఫీసరుగా పేరుంది''.

''ఆఫీసు విషయం కాదు, ఇంట్లో... అంటే మీ సమక్షంలో మీ భర్తలో ఏమంచీ మీకు కనిపించలేదా?''

''........''

''మీరు ఎక్కువ వాదిస్తారని అతనన్నాడు''

''నాకు అనిపించింది నేనడగడం వాదన ఎలా అవుతుంది?''

''ఒక విషయం గుర్తుంచుకోండి పల్లవీ! భార్యాభర్తల మధ్యన మంచి కమ్యూనికేషన్స్ చాలాముఖ్యం. నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడిగి మీనుంచి జవాబు ఆశించాను. కానీ మీరు తిరిగి నన్ను ప్రశ్నించారు. ఇది చాలా బ్యాడ్ కమ్యూనికేషన్. ఏ ఇద్దరి మధ్యన అయినా ప్రశ్నకు ప్రశ్న ఎప్పుడూ జబాబు కాకూడదు.''

''మీరు భలేవారు సార్! తనమాటలు అసంబద్ధంగా తోచినప్పుడు తిరిగి ప్రశ్నించక కుక్కలా తోకాడిస్తూ ఉండాలా? ''

''సారీ పల్లవి గారూ. మీరు నన్నూ ప్రశ్నిస్తున్నారు. నాతోనూ వాదిస్తున్నారు''.

‘‘ఇది పతివ్రతల కాలం కాదుసార్. స్త్రీలు బాగా చదువుకున్నారు. ఉద్యోగాలు, రాజకీయాలు చేస్తున్నారు.’’

‘‘అది వేరు, స్త్రీలు ఉన్నత స్థాయికి వెళ్ళడం అంటే సంసారాలు చేసుకోవద్దని కాదుగదా? మీరు విషయాలని ఎమోషనల్‌గా డీల్ చెయ్యకండి ప్లీజ్!’’

‘‘సరే... ఏం చెయ్యాలో చెప్పండి సార్?’’

‘‘మీ పట్ల మీ భర్త అభిరుచులు ఏంటో తెలుసుకున్నారా మీరు?’’

‘‘అర్థం కాలేదు డాక్టర్?’’

‘‘మీరు ఎలావుంటే అతనికిష్టమో, ప్రేమో లాంటివి’’.

‘‘అంటే అతనికి కావలసిన ప్రేమ, ఇష్టం, మోజు కోసం నా ఇష్టాయిష్టాలు, అభిరుచులు చంపేసుకోవాలా?’’

‘‘ఎవరి అభిరుచులు, ఆలోచనల కోసం వారు బతకదలుచుకున్నప్పుడు పెళ్ళి చేసుకోవడం సరికాదు. పెళ్లి అనేదొక వ్యవస్థ. దానిలోకి ప్రవేశించినప్పుడు దానికి సంబంధించిన కనీస నియమాలు పాటించాలి కదా’’.

‘‘మీరివన్నీ అతన్నీ అడిగారా సార్?’’

‘‘మీరు నన్ను మళ్ళీ ప్రశ్నిస్తున్నారు పల్లవిగారూ. మీరు ఎదుటి వాళ్లలో తప్పులు వెతకడం తగ్గించాలి. ఈ మాటలన్నీ నేను మీ భర్తని అడిగివుంటేనే మీరు నా దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటారా? లేకపోతే కౌన్సిలింగ్ ఆపేస్తారా?

‘‘లేదు సర్. కౌన్సెలింగ్ కోసమేకదా వచ్చాం!’’

‘‘ఎదుటివాళ్ళతో ఎలావుండాలో మీరు కేవలం లాజిక్ ద్వారా డిసైడ్ చెయ్యలేరు. ఒక రిలేషన్ కొనసాగించాలని అనుకున్నప్పుడు క్యూరియాసిటీని కాస్త అదుపులో ఉంచుకోవాలి. నేను మీ భర్తని ఆ ప్రశ్న అడగాల్సిన అవసరం ఉందో లేదో, అడిగానో లేదో అవన్నీ నా వృత్తికి సంబంధించిన అంశాలు. మీకు దీనితో అసలు పరిచయం లేదు కదా! సో... మీరు మాట్లాడుతున్నప్పుడు ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్. అందుకు మీకు కొన్ని మాత్రలు ఇస్తాను’’.

‘‘......... ’’

తను సైలెంట్‌గా వుండి వినాల్సి రావడం కాస్త అవమానంగా వుంది పల్లవికి.

ఒక టాబ్లెట్, ఒక చాక్లెట్ ఆమె ఎదురుగా పెడుతూ,‘‘వీటిలో ఏదో ఒకటి తీసుకోండి. ఏదైనా ఒక సిట్యుయేషన్ మనకి భిన్నంగా ఉన్నప్పుడు అసహనంగా ఉండడం ఎవరికైనా మామూలే. అది కాస్త డైవర్ట్ కావడానికి అంతే’’ అన్నాడు డాక్టరు.

‘‘ఫర్లేదు సర్.... అవసరం లేదు’’.

‘‘సరే, నేనొకటి తింటాను. మీరొకటి తీసుకోండి’’. అంటూ చాక్లెట్ ఒలిచి ఆమె చేతిలో పెట్టాడు.

ఆమెకిక తీసుకోక తప్పలేదు. డాక్టర్ నవ్వాడు. ఆమె కూడ నవ్వింది. ఆమెకెందుకో డాక్టరు ఆ సిట్యుయేషన్ని డీల్ చెయ్యడం నచ్చింది.

ఆమె నవ్వడం వల్ల రిలాక్స్ అయిందని గ్రహించాక అన్నాడు డాక్టరు.

‘‘ఇంటి లోపల ఎదురయ్యే అన్ని సందర్భాలూ ఇంత సులభంగా పరిష్కారం కావు పల్లవి గారూ. అవి గత అనుభవాలతో కలసి చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉంటాయి. అందువల్ల కొన్ని సందర్భాల్ని పరిష్కరించడం కొంతమంది భర్తలకి చాతకాక పోవచ్చు. కొందరికి పనివత్తిడి వల్ల వీలుకాక పోవచ్చు. కొందరు భార్యని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Deepam**

* * *